# సంధ్య రాల్చిన ఎర్ర రేఖలు


...మరో విధంగా ఆలోచిస్తే మనిషి అల్పసంతోషికూడాను– కాకపోతే నేను. మనిషి ఆశలు, ఆశయాలు ఎంత అనంతమై వున్నప్పటికీ ఒక్కొక్కసారి సంతృప్తి అన్నది అంత అల్పమైకూడా వుంటుంది. ఈ విషయమై ఎవరూ నాతో ఏకీభవించకపోయినా ఇది నా గట్టి నమ్మకం, నా అనుభవం. కాలి నడక నుండి, రాకెట్ యానం వరకు ఎక్కడికక్కడే సంతృప్తి జెందుతూ వచ్చింది ఈ మానవ జాతి. అయితే ఒక అల్పమైన సంతోషాన్ని కథా వస్తువుగా ఎంచుకొని కథ సాగించిన– ఈ కథలో నాయకుని పట్ల పాఠకులకు ఒక బలహీనమైన అభిప్రాయం ఏర్పడినా ఏర్పడవచ్చును. అయినా ఈ కథను నేను చెప్పుకుపోతాను.

కాలేజీలో ఏదో సందర్భంలో అనూరాధ స్టేజి ఎక్కి పాట పాడింది. నిజం చెప్పాలీ అంటే ఆ రోజునే మొదటిసారిగా ఆమె అందం గూర్చిన అభిప్రాయం నాలో కలిగింది. సన్నగా, పొడుగ్గా– మైక్ ముందు నాజూకుగా నిలుచుని పాట పాడుతున్న అనూరాధ గొంతూ శ్రావ్యతా మాట అటుంచి ఆమె వదనం, ఆ వర్చస్సు దీపకాంతిలో మరింతగా నన్ను ఆకట్టుకున్నాయి. ఎడంపక్కగా పాపిడి తీసి దువ్వబడిన జుత్తు మెడ కుడిభాగంనుండి వదులుగా, గుబురుగా ముందుకు విడువబడింది. చెవులకు సన్నిటి బంగారు పూసల రింగులు– పెద్దవి. కళ్ళల్లో అస్పష్టంగా మెరిసి ఒక మెరుపు పాట పాడుతూన్నప్పుడు హార్మోనియం మెట్లలా పైకీ, క్రిందికీ కదలాడుతున్న పెదవులు– ఆ పెదాలమీద ఎక్కడో తుషారబిందువుల వంటి తడి వుండి వుండి తలుక్కుమంటోంది. అదే నా ఆకర్షణ. అక్కడే నా దృష్టి కేంద్రీకరించా. ఒకటి రెండుసార్లు గాలికి రేగి, ముఖాన అడ్డుపడిన తల వెంట్రుకలను ఎడంచేతితో ఒత్తిగించింది.

నా ప్రక్కగా నిలుచునివున్న మిత్రుడు విశ్వం చెప్పాడు– అనూరాధ అన్నయ్య ఒక యింజనీయరుట. వాళ్ళు ఈ ఏడే ట్రాన్స్‌ఫర్ మీద హైదరాబాద్‌నుండి ఈ వూరు వచ్చారుట.

మర్నాడు సాయంత్రం కాలేజీ సైన్సు బ్లాక్ వరండా తాలూకు స్తంభం అని మరో అమ్మాయితో సంభాషణ కొనసాగిస్తున్న అనూరాధను గమనించాను. మెడలో హారం తాలూకు లాకెట్‌ను పళ్ళ మధ్య యిమిడ్చింది. పలుచని పెదాలు లాకెట్ చల్లదనాన్ని చప్పరిస్తున్నాయి.

ఆదుర్తి హరినాథ్



పక్కగా వెళ్తున్న విశ్వం, నేనూ క్షణం ఆగాము. ఆమె పెదాలు జారి లాకెట్ వక్షంమీద పడింది. ఓరగా చూచి కొంచంగా పెదవులను కదిపింది. గాలి తాకిడికి కదిలిన మబ్బుల్లాంటి పెదవులు, సంధ్య జారవేసిన ఎర్రదనం రాలి ఆ పెదవులలో "బ్రతుకు ఆలాకెట్‌గా మార్చినా చాలు" — అన్నాను విశ్వంతో. విశ్వం నా భుజం మీద వేసిన చేతితో నన్ను మరింతగా అదిమాడు.

అందం గురించిన శ్లాఘనలో కూడ ఒక ఆనందం, సంతృప్తీ వుంది. అనూరాధ సౌందర్యం గురించి, ఆమె అధరాలను చిత్రించడంలోవి సృష్టికర్త 'రసికత్వం' గురించి చాలా సేపు విశ్వానికి చెప్పుకుపోయాను. విశ్వం విచిత్రంగా చూశాడు. ఆ చూపు ఒక ఓదార్పులాంటిది; ఒక ప్రోత్సాహం లాంటిది.

"చాలా కష్టం, మంచి ఫామిలీ— విశ్వం."

ఇట్టే ప్రక్కవాడిని అపార్థం చేసుకోగల మనస్తత్వాన్ని మాత్రం అనాదిగా

ఈ లోకం కాపాడుకుంటూనే వస్తోంది. ఇంతలోనే వికసించిన పుష్పాలవంటి ఏవేవో ఆలోచనలు. మళ్ళీ విశ్వం ప్రశ్న:

"ఏం, కథ నడిపిస్తావా ఏమిటి?"

తరువాత అక్కడా, అక్కడా అనూరాధ పెదాలను సందర్శించే భాగ్యం నాకు లభిస్తూనే వచ్చింది. అనూరాధ సౌందర్యం అదొక నదీప్రవాహం – ఊటీ చల్లదనం – సంపెంగల సౌరభం – ముఖ్యంగా ఆ పెదవుల ఎర్రదనం, ఆ ఒంపూ. నా ఆంతర్యంలో ఆ అనుభూతి ఒక అమృత ప్రవాహం. ఆ ప్రవాహానికి నా పట్ల నాకు వున్న 'మంచితనం' ఒక ఆనకట్ట. అవకాశం చిక్కినప్పుడల్లా అ ప్రవాహం బలంగా ఈ ఆనకట్టను ఢీకొడుతూ వుండేది. విశ్వం ఆ బలమైన వూపుకు భాష్యం చెపుతూవుండేవాడు.

బ్రతుకును గురించిన అనేకమైన భయంకర చీకటి తెరలమీద ఈ సౌందర్యోపాసనా, సౌందర్యాన్వేషణా ఒక బలహీనపు వెలుగు కాంతి.

అయితే ప్రతి సమస్యకు పరిష్కారం కోసం తపించిపోయే మనస్తత్వం కాదు నాది. పరిష్కారమన్నది అలా, అలా అప్రయత్నంగా చేతికి చిక్కవలసినదే. పైగా, ఎందుకనోగాని అదృష్టమన్నది అదేదో నా చేతి కందని వస్తువని నా భ్రమ.

ఆరోజు అమ్మ నాతో చెప్తున్న మాటలు వింటూన్నప్పుడు నాలోని ఈ భ్రమ కాస్తా మంచుగడ్డలా కరిగిపోయింది. అమ్మమాటలు నా కోర్కెల మిత్రులమీద వర్షపు చినుకులై రాలాయి.

"ఆ అమ్మాయి మీ కాలేజీలోనే చదువుతోందిట. అన్నా, చెల్లెలు – ఏ గొడవా వుండదు. అందుకే యిహ నీతో కూడ అనందే ఆ కాస్తమాట యిచ్చేశాను.''

సాయంత్రం విశ్వానికి ఆ విషయం అంతవరకు చెప్పేసరికి ఆత్రంగా ప్రశ్నించాడు.


"ఇంతకీ నువ్వు చెప్పేది ఏ విషయంరా," అంటూ.

"మా యింట్లో అద్దెకివ్వ దలచుకున్న ఆ ప్రక్కభాగం విషయమై."

అయినా పరవాలేదు. విశ్వం నాకన్నామిత సంతోషి. పార్టీ కావాలన్నాడు. ఇద్దరం సినీమాకు వెళ్ళాం.

మాయింటి వీధి వరండాని అంటిపెట్టుకునివున్న ఎడంవైపు భాగంలో అనూరాధ, ఆమె అన్నయ్య అద్దెకు దిగారు. ఇట్లా అనూరాధ మాయింట్లో మసలడం ప్రారంభమయ్యాక నాలోని ఒకేఒక ఆశ–అది మరింతగా ప్రబలంగా రూపొంద సాగింది – ఆ అరుణవర్ణ అధరాలు, ఆ సుధారసాన్ని చిలికే పెదవులు.

అనూరాధ చాలా కలిసికట్టుగా మసలే వ్యక్తి. ఈనాడు సంఘంలో నాగ




రికతకు ముఖ్యకొలతబద్ద. అతిగా, దగ్గరిసా మాట్లాడడం అందుకు అనూరాధ నాగరికతా సంస్కారాల ప్రతిరూపంగా చెప్పుకోవచ్చును. పోతే, యిహ ఆమె శ్రద్ధగా చదువుకునే బుద్ధిమంతురాలు. అమ్మవద్ద ఎంతో వినయంగా, కావలసిన వ్యక్తిలా కాలాన్ని గడిపేది. నాతో ఎన్నో విషయాలలో వాదనకు వుపక్రమించేది. కో-ఎడ్యుకేషన్, ఆడదాని ఆంతర్యం, స్త్రీల హక్కులు, ఎన్నో. వాళ్ళ పెద్దన్నయ్య రాంచీలో వుద్యోగం, చిన్నన్నయ్య చిన్నతనంలో ఎవరో క్రిష్టియన్ అమ్మాయిని ప్రేమించడం, ఆమెతలిదండ్రులు ఆమె చిన్నతనంలోనే మరణించటం అన్నీ చెప్పుకుపోతూ వుండేది. ఆమె ధోరణి అదొక జలప్రవాహం. ఆ జలప్రవాహంలో పొంగే అలలు ఆమె పెదాలు.

రోజులు గడిచిపోతూవుంటే ఆమె మరీ దగ్గరయింది - తనకు అర్థంకాని పాఠాలు నన్ను అడిగి తెలుసుకుంటూ వుండేది. ఎప్పుడైనా నేను ఆమెకు నచ్చకపోయినట్లయితే "పోవోయ్ లైయర్!" అంటూవుండేది.

విశ్వం మాత్రం "అయితే పాఠాలు నేర్పుతున్నావన్న మాట" అంటూ ఛలోక్తి విసురుతూవుండేవాడు.

ఆరోజు ఏప్రియల్ ఫస్టు. బాగా

ప్రొద్దుటే విశ్వం రూమ్‌కు వెళ్ళవలసి వచ్చి—రాత్రి చీకటిపడేవరకు అక్కడే వుండిపోవలసివచ్చింది. విశ్వం నాకో ప్రోత్సాహమని చెప్పాను గా! నన్ను పూర్తిగా కదిపి వదిలిపెట్టాడు—అడది నోరు తెరుచుకొని ఏ విషయం అడగ లేదంటాడు. నీకు కాకపోతే యింకెవరికి ఆ అవకాశం? అంటాడు. రాత్రి ఎనిమిది గంటల వేళ యింటి కేతెంచి, భోజనము చేసి, పుస్తకం తెరిచాను.

గభాలున, అనురాధ వచ్చి, నా ప్రక్కగా, గుమ్మం ముందు ప్రత్యక్షమయింది. ప్రొద్దుట నుండి నాగురించే తాను నిరీక్షిస్తూన్నట్లు వ్యక్తపరిచింది. దేనికని తల పైకెత్తి ఆమె వైపు చూచాను. చేతిలో వున్న పెన్నుతో ఆమె నామీద యింకు జిమ్మి— "ఏప్రియల్ ఫూల్"— అంటూ పరిగెత్తబోయింది. చటుక్కున లేచి ఆమె జడ పుచ్చుకొని మెడ వెనుకకు విరిచాను. క్షమించమన్నట్లు చనువుగా చూపులు, చూపుల భావాలను స్పష్టంగా వ్యక్తం చేస్తూ వణికే, ముద్దుగొలిపే, ఒదిగిన పెదవులు— విడిచిపెట్టాను. తలుపుకు అటువైపుగా జార్లపడి నిలబడింది. ఎదుటి తలుపుకు ఆనుకొని నేను, ఆమె కళ్ళ క్రిందివరకు చీకటితెర. ఆ తెర మీద తళుక్కుమని మెరిసే నక్షత్రాల వంటి రెండు కళ్ళు. క్రిందగా నా గది దీపపుకాంతి తృష్ణగా చేరి నిలిచిన అధర ద్వయం. క్షణం ఆమె వంక చూచి—

'అందం నీ సొత్తు' — అన్నాను.

సూటిగా చూచి, కళ్లు వాలేసింది.

'ముఖ్యంగా ఆ పెదవులు.

ఆమె మూతి తిప్పింది. పెదాలు ముడుచుకున్నాయి.

'ఒక్కసారి వాటిని స్పృశించ...

కోపంతో వణికే పెదాల్ని పంటితో కొరుకుతూ.

'ఛఫ్'

నల్లని మేఘాల వెనుక దాగిన వెలుతురు కిరణం.

— ఆమె వెళ్ళిపోయింది.

రాత్రి విశ్వాన్ని మనసులో తిట్టుకోకుండా వుండలేకపోయాను. మనిషి తప్పించుకు తిరిగే మనస్తత్వం గలవాడు.


మర్నాడు ప్రొద్దుట వీధివరండాలో పడకకుర్చీలో కూర్చుని, జడను మూతి చుట్టూత చుట్టి పెదాలను భద్రంగా అందులో దాచుకుని, జడచివర చేతిలో పట్టుకుని ఎక్కడో ఆలోచిస్తోంది అనూరాధ. యిటుప్రక్కగా వున్న కుర్చీలో కూర్చుని వుండివుండి ఆమెవంక చూడసాగాను. నన్ను గమనించనట్లుగా చలించే చూపులు —

— సాహసించాను.

'ఏమండీ!'

మాట్లాడదు.

'కోపమా?'




జడను విడిచింది. పెదాలను విడుదల చేసింది.

"మిమ్మల్ని చూస్తే నాకు రోత."

"ఆడది 'నిజం చెప్పి బ్రతకలేదన్నారు."

"మీ తలకాయేమీ కాదూ."

గిరుక్కున లేచి గదిలోకి వెళ్ళిపోయి పెళ్ళున తలుపు పెట్టింది.

మబ్బును తొలగి బయట పడుతున్న చందమామ, చెట్ల ఆకుల జారి నేలను స్పృశిస్తున్న సూర్యకిరణాలు – ఆమె ముఖంలో ఎక్కడో చిరునవ్వు.

కొన్నిరకాల అపరాధాలను మనిషిలో ఏ మూలగానో ఎదిగే సంస్కారం, సభ్యత మన్నించక తప్పదు. అనూరాధ నన్ను మన్నించింది. మొదట్లో కొంచం ముభావంగా వున్నప్పటికీ, మళ్ళీ మామూలే. చదువు, వాద ప్రతివాదాలు, 'పో లైయర్' – అన్నీను.

పరీక్షలు ముగిసాయి. శలవలిచ్చారు. అనూరాధ ఆరోజు నా ఎదురుగ్గా కూర్చుని శలవలలో త నేంచెయ్యబోయేది చెప్పుకు పోతోంది. ముందుగా పెద్దన్నయ్యా వాళ్ళవూరు వెళ్తుందిట – రేపేనట.

'మళ్ళీ ఎప్పుడొస్తావ్?' అన్నాను.

'శలవ లాఖరునే.'

"తరువాత ఏం చదవదలచుకున్నావ్?" అన్నాను.

"ప్చ్" అంటూ పెదవి విరుపు. ఎప్పుడైతే అనూరాధ ముద్దుగా పెదవి విరిచిందో యిహ నే నేమీ మాట్లాడజాలని మూగివాడిని...

మర్నాడు వూరు ప్రయాణమయ్యే ముందు అనూరాధ పరధ్యానసగా ఆలోచిస్తూ, నన్ను వుద్దేశించి.

"నిన్నుచూస్తే నాకు జాలి."— అంది

'ఏం'

పెద్దగా నవ్వసాగింది.

"నిన్ను చూస్తే నాకు రోత," అన్నాను ఏమాత్రం చలించకుండా, చిలిపిగా నవ్వుతూ.

"వోవోయ్ లైయర్"— అంటూ ఆమె నా భుజాన్ని వెనుకకు నెట్టి, చెంగున పరుగెత్తింది.

ఆడపిల్ల చలాకీతనాన్ని గుర్రం పిల్లతో పోల్చి చూచుకున్న కవి ఒక మహానుభావుడు— మన స్తత్వవేత్త.

నన్నుచూస్తే జాలి అనూరాధకు. ఎందుకనోగాని ఏ విధంగానో ఆమె నన్ను అల్పుణ్ణి చేసినట్లుగా కొన్ని క్షణాలు మధనపడ్డాను. కాని చిలిపిగా నా భుజం నెట్టిన అనూరాధ నాదే. ఒక మధురమైన నిట్టూర్పు.

అనూరాధ వూరు వెళ్ళిపోయింది.

రోజులు గడిచిపోసాగాయి. మా పరీక్షఫలితాలు వచ్చాయి. నేను ఫస్టు క్లాసులో పాస్ అయ్యాను. విశ్వం తప్పాడు. అనూరాధ పరీక్ష ఒక పార్టు పోయిందని అనూరాధావాళ్ళ అన్నయ్య చెప్పాడు — మాకు ఆ విషయం ముందుగా తెలియ దనే అమాయకత్వంలో.

శలవులాఖరున అనూరాధ యింకా మా వూరు రాకముందే నేను 'మెడిసన్' చదువు నిమిత్తమై వైజాగ్ వెడలిపోయాను — తప్పదు.


కాలంతోనూ, వయస్సుతోనూ, పరిస్థితులనుబట్టి మనిషి కోర్కెలు, ఆశయాలు, అంతర్యం అన్నీ మారుతూ వుంటాయ్. గతంలోని సంఘటనల నెన్నిటినో మరిచిపోతూవుంటాం. కాని అనూరాధ అధరాలలో లీలగా నేను చూచిన వూహాలోకాలనుమాత్రం ఎప్పటికీ మరిచిపోలేను.

ఆరు నెలలు తిరిగేసరికల్లా విశ్వం నుండి ఒక విచిత్రమైన లేఖ వచ్చింది. అనూరాధకు వివాహం జరిగిపోయిందనీ, ఆమె భర్తతోబాటు హైదరాబాద్ తరలిపోయిందనీ, అనూరాధ అన్నయ్యకు మద్రాస్ ట్రాన్స్ఫర్ అయిందనీ — ఆ లేఖలోని ముఖ్యాంశములు.

హాస్టల్ రూమ్ కిటికీనుండి చూస్తే దూరంగా ఆకాశంలో అస్తమిస్తున్న అరుణబింబం — ఎవరివో ముడుచుకున్న ఎర్రటి పెదవులు.

అప్పటినుండి అనూరాధ పెదవులను ప్రపంచంలో నా కంటిముందు ప్రత్యక్షమయ్యే అనేకమైన సౌందర్యాలతోనూ, ఆకర్షణలతోనూ పోల్చి చూచుకుంటూ వుండేవాడిని.

కాలప్రవాహం ఆ దొక అనంత శక్తిస్వరూపం. ఇట్టే ఐదేండ్లు గడిచిపోయాయి.




ఆ రోజు మా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకాయన కలకత్తా వెళ్తూవుంటే వీడ్కోలు యివ్వడానికిగాను స్టేషన్‌కు వెళ్ళి, తిరిగి వస్తూవుండగా హఠాత్తుగా వైటింగ్ రూమ్ గుమ్మంవద్ద అనూరాధ తటస్థ పడింది. ఒక్కర్తే వుంది. నన్ను చూపినదే తడవుగా పరిచయపూర్వకంగా నవ్వుతో పలుకరించింది.

వైటింగ్ రూమ్‌లో ఎదుపెదుటి కుర్చీలలో ఆశీనులమయ్యాం. ఆమె చెప్పింది —వాళ్ళ బంధువు పెళ్ళికని వాళ్ళు ఈ వూరు వచ్చారుట, తనూ, భర్తా—వారం రోజులయిందిట. యివ్వేళే తిరుగు ప్రయాణం. నేను యిక్కడ వుంటూన్నట్లు ఆమెకు తెలియనందులకు ఎంతగానో నొచ్చుకుంది—భర్త యిప్పుడే పనిమీద బయటకు వెళ్ళారుట.

మేం మాట్లాడుతూ వుండగానే నాలుగైదేళ్ళ పిల్లవాడు, గదిలోకి వచ్చి, చేతిలోని బిస్కట్ల పేకట్‌తో అనురాధ కాళ్ళను పెనవేసుకున్నాడు. ఆ పిల్లవాడి భుజాలు పట్టి, నావైపు తిప్పి, అనూరాధ నన్ను ప్రశ్నించింది.

"ఈ అబ్బాయి ఎవరో చెప్పుకో చూద్దాం,'' అంటూ.

ఆ పిల్లవాడిని నా చేతులలోకి లాక్కొని, ముఖంలోకంట పరీక్షగా చూస్తూ—

"నువ్వే"— అన్నాను.

"నేనా!"

"వో, అదే నుదురు, అదే ముక్కు, అవే కళ్ళు..."

"అవే పెదాలు... కదండీ"—అంది.

కళ్ళు పైకెత్తి ఆమెవంక చూశాను. అవే పెదాలు—ఎక్కుపెట్టిన బాణం

లాంటి, ఎర్రని పెదాలు_ యదలో నాటి ప్రవాహంఒకవూపు, ఆమెవైపే నాచూపు.

"ఏమి టట్లా చూస్తావు."

ఏదో చెప్పబోయాను.

ఇంతలోనే ఆయన గదిలోకి ప్రవే శించారు. అనూరాధ ఆయనను నాకు పరిచయం చేసింది_ తన భర్త అని. అనూరాధ భర్తే కాకపోయినట్లయితే ఆయన నన్ను ఏ విధంగానూ ఆకర్షించ గలిగివుండేవాడు కాదు. ముఖ్యంగా ఆ పెదాలు, మొరటుగా, సిగరెట్ పొగలకు మాడి, బీటలుపడి, గులాబి దళం రాలి, ఏ ముళ్ళమీదనో పడినట్లు నాలో ఒకబాధ.

ముగ్గురం చాలా విషయాలు మాట్లా డుకున్నాం. రైలు అరుదెంచే వేళ అయిందని అంతా ప్లాట్‌ఫారం అంచును చేరుకున్నాం.

రైలు వచ్చింది. నేనూ కంపార్టు మెంట్ వరకు వెళ్ళాను – ఫస్టుక్లాస్.

అనూరాధ భర్త కంపార్టుమెంట్‌లో సామాను సర్దిస్తున్నాడు. అనూరాధ నా ప్రక్కగా నిలుచుంది.

ఆమె పిల్లవాడి జుత్తు సరిచేస్తూ.

"అవునూ! మాబాబు మీ కేమీ ముద్దు రావటంలేదా ఏమిటి? ఒకసారికూడా ముద్దుపెట్టుకోలేదు?"

చటుక్కున ఆమెకళ్ళల్లోకి చూచాను. ఎంత ఆత్మీయత గోచరించిం దని_

బాబును నారెండు చేతులతోను పైకంటా ఎత్తి బుగ్గమీద ముద్దుపెట్టాను. నా ఆశలు పండినట్లుగా బాబు పాలబుగ్గ ఎర్రగా కందింది.

గాభాలును అనూరాధ నా చేతులనుండి బాబూను తన చేతులలోకి తీసుకుని బాబు బుగ్గమీద ముద్దు వుంచింది.

అక్కడే!

మరో కెరటం మళ్ళీ తడిసిన అదే యిసుక భాగం. అనూరాధ మోము పరి కించసాగాను. ఆమె ప్రసన్నవదనంలో స్వచ్ఛమైన ఒక చిరునవ్వు_ మలయమారు తంలా, మంచుగడ్డలా_ చల్లగా, యింకా చల్లగా – చరిత్ర చెప్పిన అనేక సత్యాలు ఆమె కళ్ళల్లో జ్యోతుల్లా వెలిగాయి.

అంతా రైలు ఎక్కారు. రైలు కదల బోతూవుండగా అనూరాధ, బాబు, అనూ రాధ భర్త ముగ్గురూ చేతులు వూపుతు న్నారు. అనూరాధ సూటిగా, కళ్ళరెప్పలు వాల్చకుండా నావైపే చూస్తోంది. రైలు దూరంగా కదిలిపోతూవుండగా ఎక్కడో ఆలోచిస్తూ నేనూ చెయ్యి వూపసాగాను.

ఈ యావత్ సృష్టి ఒక్కసారిగా ఎర్రగా, యింకా ఎర్రగా – ఎవరివో తాంబూలం వేసుకున్న పెదవులలా మారి పోతూన్నట్లు అనిపించి నాకళ్ళు జిగేల్ మన్నాయి. ఎన్నాళ్ళనుండో నాలో నిలిచి పోయిన ఆనకట్ట బ్రద్ద లయింది. వుర కలు వేస్తూ పొంగే ప్రవాహం...

అందుకే, మరోవిధంగా ఆలోచిస్తే మనిషి అల్పసంతోషికూడానూ _ కాక పోతే నేను.

———